సాక్షి
వికారాబాద్
సోమవారం । 11 । ఆగస్టు । 2025



ధీమా ఇవ్వని బీమా

రైతు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబీమాను ప్రవేశ పెట్టింది. 8లో▸



సాధారణ పరిహారమేనా?

దుద్యాల్ మండల పరిధిలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతులకు పరిహారం అందుతుంది. 8లో▸



సబ్సిడీ అమలయ్యేనా?

రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సబ్సిడీ పథకాలకు ప్రభుత్వం మంగళం పాడడంతో అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

గ్రామాభివృద్ధికి కృషి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు రూరల్: తాను పుట్టి పెరిగిన ఊరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బెల్కటూర్‌లో స్పీకర్ తన వ్యవసాయ క్షేత్రంలో పునర్నిర్మించిన మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన బెల్కటూర్‌తో పాటు గ్రామస్తులను గుర్తు చేశారు. బెల్కటూర్–కరన్ కోట్ మార్గంలో బ్రిడ్జి నిర్మాణ పనులు నెల రోజుల్లో పూర్తి అవుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మదన్ మోహన్, నారాయణరెడ్డి, వెంకటేష్, అశోక్, యువకులు పాల్గొన్నారు. అంతకుముందు పురోహితులు స్పీకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, పట్టణ సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

16న తాండూరుకు రానున్న కృష్ణమాదిగ



సన్నాహక సమావేశంలో దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 16వ తేదీన తాండూరుకు రానున్నట్లు ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ మాదిగ తెలిపారు. ఆదివారం పలువురు దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో తాండూరులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధాప్య, వితంతు తదితరులకు రూ.4 వేలకు పెన్షన్ పెంచకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న తాండూరులో నిర్వహించనున్న సభకు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు చెప్పారు. కావున నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, చేయూత పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌మాదిగ, నాయకులు ఆశన్న, కృష్ణ, స్వామిదాస్, మహేందర్, జగదీష్, సూర్యప్రకాష్, ఉమాశంకర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు సమష్టి పోరు

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



ధర్నా చేస్తున్న నాయకులు

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చట్టం చేసి వెంటనే అమలు చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపించినా బీజేపీ ప్రభుత్వం కావాలనే చట్టం చేయడం లేదని ఆరోపించారు. బీసీల పట్ల కపట ప్రేమ చూపిస్తున్న వారికి సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నవీన్, సత్తయ్య, లాలయ్య, లక్ష్మయ్య, శంకర్, కిశోర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో భద్రం

స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్లతో ప్రాణాలకు ముప్పు

వ్యవసాయ పనుల్లో భాగంగా గత శుక్రవారం కరిగేటు చేస్తుండగా తెగిన సర్వీస్ వైర్‌ను సరిచేసే క్రమంలో యాలాల మండలం ముద్దాయిపేటలో యువరైతు రమేశ్‌గౌడ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, పిల్లలు వీధిన పడ్డారు.

కుల్కచర్ల మండలం బిండెంగడ్డ పంచాయతీ చింతల్‌కుంటతండాకు చెందిన యువరైతు భాస్యనాయక్ శనివారం సాయంత్రం పొలం వద్ద విద్యుత్ సరఫరా కావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరిశీలించాడు. అక్కడ తీగలు సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. ఈ రెండు సంఘటనల్లో చిన్నపాటి నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలిగొంది. దీంతో ఇరు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.



- పొలాల వద్ద అప్రమత్తత అవసరం
- సమస్యలుంటే ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వాలి
- ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ రఘువీర్



యాలాల: వర్షాకాల నేపథ్యంలో తరచూ వ్యవసాయ బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంటు సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. రైతులు విద్యుత్ సరఫరా కోసం తామే స్తంభాలు ఎక్కడం, ఫ్యూజులు మార్చడం, తీగలు సరిచేయడం చేస్తుంటారు. ఇది ఎంతో ప్రమాదకరమని, కరెంటు విషయంలో నిపుణులైన ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చి సమస్య పరిష్కరించేంత వరకు రైతన్నలు ఓపిక పట్టాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు సూచనలిస్తున్నారు. ఇటీవల జరిగిన రెండు ఘటనల నేపథ్యంలో మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ రఘువీర్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

సొంత నిర్ణయాలు తీసుకోవద్దు

❖ రైతులు పొలాల వద్ద ఏర్పడే కరెంటు సమస్యల విషయంలో సొంతంగా మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రావొద్దు. సమస్య వస్తే వెంటనే స్థానిక లైన్‌మెన్ లేదా ఏఈకి సమాచారం ఇవ్వాలి.

❖ వర్షాకాలం నేపథ్యంలో బోర్ల వద్ద, సర్వీస్ వైర్లు ముట్టుకునే సమయంలో భూమిపై తడి ఉంటే, తప్పనిసరి తగు భద్రత చర్యలు తీసుకొని ముందుకు వెళ్లాలి. కాళ్లకు తప్పనిసరిగా రబ్బరు చెప్పులు ధరించాలి. తడి చేతులతో ఎట్టి పరిస్థితుల్లో స్టార్టరు, బోర్లు, సర్వీసు వైర్లను తాకవద్దు.

❖ పొలాల్లోని స్తంభాలపై తీగలు తెగినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు ఎగిరినప్పుడు ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించాలి. అలా కాకుండా అనధికార వ్యక్తులు స్తంభాలు ఎక్కడం నేరం. విద్యుత్ అధికారులు స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకొని మరమ్మతులకు పూనుకుంటారు.

❖ రైతులు కరెంటు విషయాల్లో కాస్త ఓపికగా ఉంటే ఎంతో మేలు. అరగంట, గంట ఆలస్యమైన ట్రాన్స్‌కో సిబ్బంది సమస్య ఉన్న ప్రాంతానికి వచ్చేంతవరకు ఆగండి. అంతేకానీ ఆలస్యమవుతుందనే భావనలో ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దు.

❖ విద్యుత్ సమస్య పరిష్కారంలో నిపుణులైన ట్రాన్స్‌కో సిబ్బంది, రక్షక పరికరాలతో విద్యుత్ స్తంభం ఎక్కడం, మరమ్మతులు చేయడం, కనెక్షన్ ఇవ్వడం, ఫ్యూజులు మార్చడం చేస్తుంటారు. ఈ విషయంలో కర్షకులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలి.

❖ రైతులు తమ వ్యవసాయ బోర్ల వద్ద, కరెంటు స్తంభాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ బుడ్డీలు ఏర్పాటు చేసిన ప్రదేశం ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. గడ్డి, కంపచెట్లు, ఇతర మొక్కలు పెరగకుండా తొలగిస్తూ ఉండాలి. ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా భూమి చదునుగా ఉండేలా చూడాలి.

❖ ప్రమాదవశాత్తు రైతులు కానీ, మూగ జీవాలు కానీ మరణిస్తే శాఖ పరంగా ఆర్థికపరమైన సాయం బాధిత కుటుంబాలకు అందుతుంది. ప్రమాద అనంతరం సంబంధిత పత్రాలు, వివరాలను ట్రాన్స్‌కో సిబ్బందికి అందజేస్తే 60 రోజుల్లో పరిహారం అందే అవకాశం ఉంది.



తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ వద్ద పొంగి పొర్లుతున్న కత్వ

వాన జోరు.. వరద హోరు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. ఆదివారం జోరుగా పడిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లోకి వరద నీరు చేరి పంటలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రహదారులపై వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెరువులు అలుగు పారాయి. పెద్దేముల్ మండలం గాజీపూర్ వాగు వద్దనున్న కత్వ పొంగి పొర్లింది. ఓ వైపు జలసిరి ఉట్టి పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేసినా, మరోవైపు పంటలు మునగడంతో విచారిస్తున్నారు. విద్యుత్ తీగలు తెగి పడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



అనంతగిరి: అలుగు పారుతున్న శివసాగర్ ప్రాజెక్టు



అనంతగిరి: బూర్గుపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరద ప్రవాహంలో చిక్కుకున్న ఆటో



దోమ: ఊటుపల్లిలో ఈదురు గాలులకు రోడ్డుపై పడిన చెట్టు



అనంతగిరి: బురదమయంగా వికారాబాద్ రైతుబజార్

అర్జీలకే పరిమితం

- రాజీవ్ యువ వికాసానికి తీవ్ర జాప్యం
- ఎంపిక ప్రక్రియ పూర్తయినా అమలుకు నోచుకోని వైనం
- నిరాశలో లబ్ధిదారులు



వికారాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తామని హడావుడి చేసిన సర్కారు నేటికి ఆ ఊసెత్తడం లేదు. లబ్ధిదారుల ఎంపిక చేసిన అధికారులు అంతటితో మిన్నకుండిపోయారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కోసం మే 14వ తేదీ వరకు యువత నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు అనంతరం వెరిఫికేషన్ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. జిల్లాలో మొత్తంగా 50,406 అర్జీలు వచ్చాయి.

నేతల కనుసన్నల్లో ఎంపిక

మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ చేపట్టగా ఇందులో బ్యాంకర్లను కూడా భాగస్వాములను చేస్తున్నారు. అయితే బ్యాంకు సిబిల్ స్కోర్‌ను కూడా పరిగణలోకి తీసుకున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఎంపిక ప్రక్రియలో తమ ప్రమేయం ఏమిలేదని అంతా పారదర్శకంగా చేపడుతున్నామని ప్రభుత్వంతో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పేర్కొంటున్నారు. అయితే నేతల కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ప్రచారంలో ఉంది. దీంతో దరఖాస్తులు చేసుకున్నవారు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జూన్ 2వ తేదీనే జాబితా ప్రకటిస్తామన్న ప్రభుత్వం జాప్యం చేయడం ఏంటని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో దరఖాస్తుల తీరు ఇలా..

మండలం	అర్జీలు
బంట్వారం	1,182
బషీరాబాద్	2,125
బొంరాస్‌పేట	2,180
చౌడాపూర్	1,741
ధారూరు	2,380
దోమ	3,136
దౌల్తాబాద్	1,971
దుద్యాల్	1,904
కొడంగల్	2,156
కొడంగల్(మున్సిపల్)	760
కోట్‌పల్లి	1,141
కుల్కచర్ల	3,311
మర్పల్లి	1,964
మోమిన్‌పేట్	1,804
నవాబుపేట్	1,494
పరిగి	2,615
పరిగి(మున్సిపల్)	604
పెద్దేముల్	3,200
పూడూరు	2,320
తాండూరు	3,456
తాండూరు(అర్బన్)	2,350
వికారాబాద్	1,423
వికారాబాద్(అర్బన్)	2,903
యాలాల	2,286
మొత్తం	50,406

తాండూరులో అత్యధికం

మే నెల మొదటి వారంలో 20 మండలాలతో పాటు నాలుగు మున్సిపాలిటీల నుంచి రాజీవ్ యువ వికాసం పథకం (ఆర్‌వైవీసీ) కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో కొడంగల్ మున్సిపాలిటీలో అత్యల్పంగా 760 మంది మాత్రమే దరఖాస్తులు చేసుకోగా.. అత్యధికంగా తాండూరు మండలంలో 3,456 మంది అర్జీ పెట్టుకున్నారు. మండలాలు, మున్సిపాలిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించి వెరిఫికేషన్ పూర్తి చేశారు. నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో కలిపి 50,406 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వారు ఎంపిక చేసుకున్న యూనిట్ ధరను బట్టి రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రాయితీపై రుణాలు అందజేయనున్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

తాండూరు టౌన్: రానున్న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజించాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని దస్తగిరిపేట్‌లో కుమ్మరి శంకర్ తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించడంతో కుల వృత్తుల వారికి చేయూతనిచ్చిన వారవుతారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించి, నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతోందన్నారు. నియోజకవర్గ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని, పర్యావరణ, కాగ్నా నది పరిరక్షణకు దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ షకూర్, వెంకటేష్, నర్సమ్మ, మంజుల, నవీన్, జగదీశ్వర్, సిద్ధార్థ్‌గౌడ్, రాము, వివేక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయలు

ధరలు పెరగడంతో సామాన్యుల తిప్పలు

- అదుపులోకి తేవాలని విజ్ఞప్తి
- సాగు విస్తీర్ణం తగ్గడమే కారణమని విశ్లేషణ



నవాబుపేట/మోమిన్‌పేట: రోజురోజుకూ మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఏది కొందామన్నా కొండెక్కి కూర్చొని సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీనికితోడు నిత్యావసర వస్తువుల ధరలు సైతం అమాంతం పెరగడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ప్రజలు విలవిలలాడుతున్నారు. భగ్గుమంటున్న ధరలను అదుపు చేసేందుకు పాలకులు, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నవాబుపేట, తదితర ప్రాంతాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలు అధికంగా సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వర్షాలు సమయానికి కురవకపోవడం కూరగాయలు, పప్పుదినుసుల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఫలితంగా వ్యాపారులు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. దీంతో కాయకూరలకు ధరలు బాగా పెరిగాయి.

రెట్టింపైన నిత్యావసరాలు

కూరగాయలకు తోడు నిత్యావసర సరుకుల ధరలు నెల రోజుల్లోనే రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పెసర్లు కిలోకి రూ.120, మినుములు కిలో రూ.100, బొబ్బర్లు రూ.90. ఉలువలు రూ.100, పచ్చజొన్నలు రూ.40, ధనియాలు రూ.100, వెల్లుల్లి రూ.100, మినపపప్పు రూ.130, శనగ రూ.70 పలుకుతున్నాయి. కోడిగుడ్డు ధర ప్రస్తుతం రూ.6 ఉంది. పెరిగిన ధరలను చూసి వినియోగదారులు జంకుతున్నారు. నిత్యం కూలినాలీ చేసుకొని జీవించే శ్రమజీవులు పెరిగిన ధరలతో సతమతమవుతున్నారు.

శాకాహార ప్రియులతో..

శ్రావణమాసంలో మెజార్టీ హిందువులు మాంసాహారానికి దూరంగా ఉంటారు. కూరగాయల ధరల పెరుగుదలకు ఈ అంశం కూడా కారణమని పరిశీలకులు భావిస్తున్నారు. ఎక్కువగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో కూరగాయలు, ఆకు కూరలతో చేసిన వంటలే ఉపయోగిస్తారు. దీనికి తోడు ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో వెజిటెబుల్స్ వినియోగం అమాంతం పెరిగింది. అందుకే ధరలు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి.

వికారాబాద్ మార్కెట్‌లో ధరలు

రకం	ధర(కిలోకి)
పచ్చిమిర్చి	రూ.120
మునగకాయలు	రూ.120
చిక్కుడు	రూ.100
బీన్స్	రూ.100
క్యాప్సికం	రూ.80
బెండకాయ	రూ.80
బీరకాయ	రూ.80
క్యారెట్	రూ.60
టమాట	రూ.60
వంకాయ	రూ.60
ఉల్లిగడ్డ	రూ.60
సొరకాయ(ఒక్కటి)	రూ.15

క్లుప్తంగా

కిరాణ దుకాణంలో చోరీ

పోలీసులకు ఫిర్యాదు



ధారూరులో చోరీకి గురైన దుకాణం

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని కమాన్ సమీప కిరాణ దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. దోమ ఆంజనేయులు కొన్ని సంవత్సరాల నుంచి కిరాణ దుకాణం నడుపుతున్నారు. శనివారం కూరగాయల సంత ముగిసిన తర్వాత రాత్రి 8 గంటల ప్రాంతంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. సంతరోజు జరిగిన వ్యాపార డబ్బులు గల్లా పెట్టెలోనే పెట్టి వెళ్లాడు. తెల్లారి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని దొంగలు ఇనుప రాడ్‌తో తాళం ఊడదీసి లోపలికి ప్రవేశించారు. గల్లా పెట్టెలోని రూ.10వేలు అపహరించారని ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు దుకాణానికి వెళ్లి గల్లాపెట్టెను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ- కారు ఢీ

ఒకరికి గాయాలు

మొయినాబాద్: అతివేగంతో వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి అజీజ్‌నగర్‌కు చెందిన దప్పు కిరణ్ ప్రభుత్వ ఉద్యోగి. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో.. సదరు వ్యక్తి తన కారులో మొయినాబాద్ వైపు నుంచి అజీజ్‌నగర్ వెళ్తుండగా హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల వద్ద కారు అదుపుతప్పి, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం క్షతగాత్రుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం దేవునిగుడితండాకు చెందిన కేతావత్ దేవ్లీ(70) ఈ నెల 7న మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధి ఉడిత్యాలతండాలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లింది. తిరిగి ఆదివారం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆమె షాద్‌నగర్‌కు వచ్చింది. గిరిజనుల అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తుండగా.. స్థానికంగా డయోగ్నస్టిక్ సెంటర్లో పనిచేస్తున్న డాక్టర్ శ్వేత తన కారును పార్కింగ్ చేసే క్రమంలో దేవ్లీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

కబ్జాకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలి

రాజేంద్రనగర్: హిందూ శ్మశాన వాటికను చదును చేసి కబ్జాకు యత్నించిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని మజ్లిస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు షేక్ రియాజ్ కోరారు. ఆదివారం ఉదయం హనుమాన్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిసర ప్రాంతాల ప్రజలు ఆరు దశాబ్దాలుగా హనుమాన్‌నగర్‌లో హిందూ శ్మశాన వాటికను వినియోగిస్తున్నారన్నారు. శ్మశాన వాటికపై కన్నేసిన రియల్టర్లు శ్మశాన వాటికను రాత్రికి రాత్రే చదును చేశారని ఆరోపించారు. పత్తికుంటలోకి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు శ్మశాన వాటిక పక్క నుంచి కాలువ ద్వారా ప్రవహించేదన్నారు. భూకబ్జాదారులు కాలువను మూసి వేయడం ద్వారా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు స్థానికంగా ఉన్న ప్రహరీ కూలిందన్నారు. ఇదే అదునుగా కొందరు రియల్టర్లు హింతూ శ్మశాన వాటికను కబ్జా చేస్తూ ప్రహరీని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ దృష్టికి సోమవారం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

చేవెళ్ల: ఎగువన కురుస్తున్న వర్షాలకు ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ఎగువ ప్రాంతాలైన వికారాబాద్ జిల్లా పూడూరు, పరిగి ప్రాంతాలతోపాటు చేవెళ్ల మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో చేవెళ్ల మండలం దేవరంపల్లి వద్ద వాగులో వరద ఉధృతి పెరిగింది. ఇప్పటికే హిమా యత్‌సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి ఒక అడుగు తక్కువగా ఉండడంతో అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. ఈసీ వాగులో వరద పెరగడంతో మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉంది. మరో వైపు వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధీమా ఇవ్వని బీమా



రైతుబీమా కోరకు దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

రైతులకు అందని పత్రాలు

- తప్పుల సవరణకు సమీపించిన గడువు
- రేపటితో ముగింపు
- అవగాహన లోపంతో అన్నదాతలు
- క్లెయిమ్‌లో తప్పని తిప్పలు

కేశంపేట: రైతు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబీమాను ప్రవేశ పెట్టింది. అందుకు 18 నుంచి 59 ఏళ్లవారిని అర్హులుగా పేర్కొంది. ఇందులో భాగంగా అర్హులైన వారి నుంచి ఆధార్‌కార్డు, నామిని వివరాలతో పాటు పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను జతచేసి ఉన్న దరఖాస్తులను మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించారు. అలా వారు సేకరించిన ఆధారాల ప్రకారం.. బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఐసీకి చెల్లించింది. అనంతరం రైతుల పేరిట బీమా సంస్థ జారీ చేసిన ఐడీ నంబర్‌తో కూడిన బాండ్లను వ్యవసాయశాఖ.. రైతులకు అందజేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు బాండ్లు తమకు అందలేదని, బీమా ఉందన్న ధీమా లేకుండా పోయిందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

అధికారులే బాధ్యులు?

బీమా పత్రాల్లో తప్పులు ఉంటే మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులే బాధ్యులని ప్రభుత్వం గైడ్‌లైన్స్‌లో పేర్కొంది. రైతులు తమ ఆధార్‌కార్డులో ఇంటిపేరు, పేరు, వయస్సు లాంటి వివరాలను మార్చుకుంటే క్లెయిమ్ సమయంలో ఇబ్బందులు వస్తాయని, దీనికి అధికారులే బాధ్యతను వహించాల్సి ఉంటుందని తెలిపింది. గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు, పుట్టిన తేది, నామిని తదితర వివరాలను మార్చుకోవాలని అనుకుంటే.. విస్తరణ అధికారులను సంప్రదించి బీమా నమోదులో సవరణ చేసుకోవాలని రైతులకు అవగాహనను కల్పించాల్సి ఉంటుంది.

అవగాహన కరువు

పత్రాల్లో ఏమైనా తప్పులు ఉంటే దానిని సరిచేసుకోవడానికి రెనివల్ సమయంలో అవకాశం కల్పించారు. అయితే బాండ్లు అందకపోవడంతో.. అందులో తప్పులు ఉన్న విషయం తెలియకపోవడం వలనే రైతులు మార్చుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఈ నెల 12 వరకు మాత్రమే మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నూతనంగా జూన్ 5 వరకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు.. ఈ నెల 13 వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. ఇదిలా ఉండగా.. బీమా ఉన్నప్పటికీ.. పత్రాలు అందక పోవడంతో అందులో తప్పులు ఏమున్నాయో తెలియడం లేదని రైతులు పేర్కొనడం గమనార్హం.

2019 నుంచి



బాండ్ పేపరు

పథకం ప్రారంభంలో అర్హులైన రైతులకు ప్రభుత్వం బాండ్లను అందజేసింది. 2019 నుంచి ఇవ్వడం లేదు. దీని కారణంగా అందులో తప్పులు ఏమున్నాయో రైతులకు తెలియడం లేదు. ఏమైనా తప్పుడు సమాచారం ఉంటే.. భవిష్యత్‌లో రైతు కుటుంబ సభ్యులు క్లెయిమ్‌కు వెళ్లినప్పుడు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాంటి సమస్య వచ్చినప్పుడు ఇప్పటి వరకు అఫిడవిట్‌ను వ్యవసాయ అధికారులకు సమర్పించి, క్లెయిమ్ పొందేవారు. కానీ ఇప్పుడు అఫిడవిట్ లేదని, బీమా పత్రం ఆధారంగానే చెల్లింపు ఉన్నట్లు సమాచారం.

బీమాను ఎత్తివేసేందుకు కుట్ర



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదు. గత ప్రభుత్వం తెచ్చిన రైతుబీమా పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోంది. అందులో భాగంగానే కొత్తగా నమోదు చేసుకునేందుకు మూడు రోజుల గడువే ఇచ్చింది. బీమా చేసుకున్న వారికి పత్రాలు అందజేయలేదు.

– నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్, కొత్తపేట

బాండ్లు ఇవ్వాలి



ప్రభుత్వాలు రైతులకు బీమా బాండ్లను అందించలేదు. వాటిల్లో ఏమైనా తప్పులు ఉంటే క్లయిమ్ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తప్పవు. పత్రాలను అందజేస్తే.. మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుంటుంది. ప్రభుత్వం వెంటనే బీమా పత్రాలను రైతులకు అందజేయాలి.

– నరేందర్‌రెడ్డి, సంతాపూర్

సాధారణ పరిహారమేనా?

- జనరల్ అవార్డు ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం
- భూములు ఇవ్వని రైతులకు షాక్



హకీంపేట్ గ్రామ ముఖ చిత్రం

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి గ్రామాలకు చెందిన 1,275 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి రైతులు తమ పొలాలను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇస్తూ పరిహార చెక్కులను తీసుకుంటున్నారు. కానీ భూములు ఇవ్వని మరికొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి పలుమార్లు నోటీసులు జారీ చేసింది. అయినా వారిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో మరో అడుగు ముందుకేసింది. జనరల్ అవార్డు ప్రకటించేందుకు సిద్ధమైంది. అందుకు సంబంధించి జూలై 19న నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. హకీంపేట్ గ్రామానికి చెందిన రాకం యాదయ్య సర్వేనంబర్ 240లో 2.21 ఎకరాలు, అదే గ్రామానికి చెందిన రఘులకోల ప్రదీప్ కుమార్ సర్వేనంబర్ 245లో 10 గుంటల పట్టా భూమికి గాను నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో వారిరువురి విషయంలో కోర్టునుంచి పరిహారం ఇవ్వనున్నట్లు తెలిసింది. అంగీకారంతో ఇచ్చే భూములకు వచ్చే పరిహారం కాకుండా సాధారణ పరిహారం మంజూరు చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా లగచర్ల గ్రామానికి చెందిన భూములు ఇవ్వని రైతులకు కూడా జనరల్ అవార్డు కింద నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

ఘనంగా లక్ష బిల్వార్చన

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక లక్ష్య బిల్వార్చన చేసి తీర్థ ప్రసాదాలు అందుకుని మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మార్మోగింది. పలువురు ప్రముఖులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజచేసి హారతి ఇస్తున్న భక్తులు



శివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కోట్‌పల్లి ప్రాజెక్టుకు చేరుతున్న వరద



కోట్‌పల్లి ప్రాజెక్టు

16 అడుగులకు చేరిన నీటిమట్టం

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టులో వాగుల ద్వారా ఆదివారం వరకు 16 అడుగుల మేర వరదనీరు చేరింది. 3 సంవత్సరాల నుంచి జూలై నెలలోనే ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయేది. అక్కడి నుంచి అలుగు ద్వారా కాగ్నా నుంచి ప్రవహించి కృష్ణానదిలో చేరేది. కానీ ఈ సారి వర్షాలు సంవృద్ధిగా కురియకపోవడంతో ఎగువ ప్రాంతాలనుంచి వరద ప్రవాహం తగ్గింది. జూలైలో కేవలం 4 అడుగుల నీరు చేరడంతో 14.6 అడుగుల వరకు నీటి నిల్వకు చేరింది. మరో 8 అడుగుల నీరు చేరితేనే ప్రాజెక్టు పూర్తిగా నిండుంతుందని అధికారులు చెబుతున్నారు. రబీ పంటలకు నీరు అందాలంటే ప్రాజెక్టు పూర్తిగా నిండాలని రైతులు చెబుతున్నారు.

ఫార్మా భూముల్లో హెలిక్యాప్టర్ చక్కర్లు

ఆసక్తిగా గమనించిన స్థానికులు

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన యాచారం, కందుకూరు మండలాల్లోని భూములపై ఆదివారం సాయంత్రం హెలిక్యాప్టర్ చక్కర్లు కొట్టింది. యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో హెలిక్యాప్టర్ అతి దగ్గరగా చక్కర్లు కొట్టడం స్థానికులు ఆసక్తిగా గమనించారు. కొన్ని నెలలుగా రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ అధికారులు ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే చేసి, ఫెన్సింగ్ వేశారు. వారం రోజులుగా పరిహారం ఇచ్చి సేకరించిన సర్వే నంబర్లలోని రైతుల వారీగా కబ్జా భూములను సర్వే చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

షాద్‌నగర్: కర్ణాటకలోని షిమోగో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మాలే షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ అంతర్జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యాదవ బూడోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు బద్రీనారాయణ, హరీష్, గోకుల్ నందన్, రుషికేష్, వియన్, వెదన్స్, దేవ్‌మదేశ్, ఇన్మూనుల్, హరికృష్ణ సత్తాచాటారు. బంగారు, వెండి, రజిత పతకాలు సాధించినట్లు క్లబ్ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్ తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

తాళం వేసిన ఇంటికి కన్నం

- ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, నగదు చోరీ
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

షాద్‌నగర్‌రూరల్: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేశారు. తాళం పగులగొట్టి, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, కొంత నగదును అపహరించారు. ఈ సంఘటన షాద్‌నగర్ పట్టణం రతన్‌కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రతన్‌కాలనీలో నివాసం ఉంటున్న అంకం వనజకు ముగ్గురు ఆడపిల్లలు. భర్త కొమురయ్య కొంతకాలం క్రితం చనిపోవడం, పెద్ద కూతురు అనూషకు వివాహం కావడంతో ఇద్దరు కూతుళ్లతో కలిసి ఉంటోంది. ఈ నెల 3న వనజ.. ఇంటికి తాళంవేసి కుమార్తెలతో కలిసి ఘట్‌కేసర్‌లో ఉన్న పెద్దకూతురు ఇంట్లో బోనాల పండుగకు వెళ్లింది. అక్కడి నుంచి మల్కాజిగిరిలో ఉంటున్న చెల్లెలు మంజుల నివాసానికి 4న వెళ్లారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో అక్కడే నాలుగు రోజులు ఉన్నారు. తిరిగి ఈ నెల 8న ఉదయం 'మీ ఇంటి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఉందని' బంధువు నుంచి సమాచారం అందింది. ఈ మేరకు వారు ఇంటికి వచ్చి చూడగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

కందుకూరు: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి వినియోగించకుండా ఇతర ప్రయోజనాలకు వినియోగిస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వామపక్షాల పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పడిందన్నారు. ప్రస్తుతం బోర్డు నిధులను పక్కదారి పట్టించడంతో ఇబ్బందిగా మారిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు ద్వారానే నిధులను కార్మికులకు ఖర్చు చేస్తున్నాయని, ఇక్కడ మాత్రం ఆవిధంగా లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ప్రమాద బీమా, 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పోల్కం శ్రీరాములు, అధ్యక్షుడిగా బండి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా కొమురయ్య, గోల్కొండ లక్ష్మయ్య, కోశాధికారిగా ఆర్.రవి, ఉపాధ్యక్షుడిగా జింకల సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా శేఖర్, యాదయ్య, ఉప్పల కృష్ణ, చిన్నయ్య, అంబటి సురేష్, మాదారం సురేష్, కె.నరసింహ, వెంకటేశ్ ఎన్నికయ్యారు.

విగ్రహాల ధ్వంసం దారుణం

- దుండగుడిని కఠినంగా శిక్షించాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్



దేవాలయాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని బంగారు మైసమ్మ దేవాలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ డిమాండ్ చేశారు. నిందితున్ని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వ్యక్తిని.. అతడి వెనుక ఉన్న వారిని అరెస్ట్ చేయాలన్నారు. బంగారు మైసమ్మ దేవాలయం ఆవరణలోకి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు దేవాలయంలోని విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేసి పారిపోయాడు. నిందితుడు వెళ్లిన అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులు ఈ విషయాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు వై.శ్రీధర్, మహిపాల్ రెడ్డి, హరికిషన్ జీ, సందీప్ ముదిరాజ్, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, యువకులు పెద్ద ఎత్తున దేవాలయ ప్రాంగణంలోకి చేరుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని పట్టుకొని శిక్షిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ విషయమై రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మాట్లాడుతూ... దేవాలయాలపై దాడులు సహించరానిదన్నారు. నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కుట్ర జరుగుతుందని ఆరోపించారు. రానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఐక్య పోరాటానికి సిద్ధంకండి



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

- 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధనకు రాష్ట్రం నుంచి ఎంపికైన బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని.. లేని పక్షంలో తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీసీ బిల్లును తేల్చకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో జాప్యం జరుగుతోందని అన్నారు. దీనిని సాకుగా చూపి పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయడం లేదన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు అమలుచేస్తూ ఇక్కడ అడ్డుపడటం ఏమిటని ప్రశ్నించారు. బీసీలకు అనుకూలం అంటునే బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాంచంద్రరావు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నట్లు ఆరోపించారు. రేవంత్ సర్కార్ అందరినీ కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని.. అందుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేల్, తాడిగళ్ల భాస్కర్, దుబ్బాక రామచందర్, ఏర్పుల నర్సింహ, బి. జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు ఆలంపల్లి నరసింహారావు, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జి.నర్సింహ, కిషన్, రుద్రకుమార్, జగన్, సుమలత, విఘ్నేష్, పురుషోత్తం పాల్గొన్నారు.



దిలావర్‌ఖాన్ చెరువు వద్ద చేపలు పడుతున్న యువకులు



ఆపిల్ అవెన్యూ కాలనీలో నాలా పొంగి, ఇళ్ల మధ్యలో నుంచి వరద పరుగు

చెరువుకు జలకళ

- భారీ వర్షాలతో అలుగు పోస్తున్న మాసబ్ చెరువు
- ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న వరద

తుర్కయంజాల్: వరుస భారీ వర్షాలతో తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు జలకళ సంతరించుకుంది. వరద పోటెత్తడంతో అలుగు పారుతోంది. శనివారం సాయంత్రం కురిసిన వానతో చెరువు నుంచి పెద్ద మొత్తంలో నీరు బయటకు ప్రవహిస్తోంది. దీంతో సాగర్ రహదారిపై నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు.. ప్రవాహాన్ని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి 8 గంటల నుంచి ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీలో ఇళ్ల మధ్యలో వాగుపై నిర్మించిన రోడ్డుపై అడుగున్నర మేర నీరు ప్రవహించింది. ఈ కాలనీలో గతంలో వెంచర్ నిర్వాహకులు.. వాగును కబ్జా చేసి దానిపై మూడు అడుగుల నాలాను నిర్మించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు కురిసి.. చెరువు అలుగు పారినప్పుడు నీరు, కృత్రిమంగా నిర్మించిన నాలా పొంగి, ఇలా ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తుంటుంది. ఇళ్లను ముంచెత్తుతుంది. ఆదివారం మధ్యాహ్నం వరకు వరద కొంత తగ్గుముఖం పట్టింది. దీంతో స్థానికులు చేపలను పట్టేందుకు ఉత్సాహం చూపారు. ఇంజాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చుట్టూ వరద చేరింది. దిలావర్‌ఖాన్ చెరువు నీరు ఉధృతంగా పరుగులు తీస్తోంది.